

# పాతచొక్కా

ఓట్ర ప్రకాశరావు




**ఛాయమ్మ ఇంటి పనిముగించుకొని అటు వెళ్ళగానే నేను మా అబ్బాయి అభిలాష్ దగ్గరకెళ్ళి "చొక్కా వేసుకునేటప్పుడు టైట్‌గా వుంది అని చెప్పవద్దని నీకు ఎన్నిసార్లు చెప్పాను" వ్యంగ్యంగా అంటూ చేతితో వాడి వీపుమీద రెండు దెబ్బలు వేయగానే ఏడుపు మొహంతో సరేనన్నట్టుగా తల ఆడిస్తూ ఆడుకోడానికి బయటకు వెళ్ళాడు.**

"అభిలాష్‌ను అనవసరంగా ఎందుకు కొట్టావు యమునా" మా వారు అడిగాడు.

"మిమ్మల్ని కొట్టలేక" కోపంతో అన్నాను.

ఆయన అర్థంకానట్లు బిక్కమొహం పెట్టారు. "ఆ బొమ్మల చొక్కా తీస్తున్నప్పుడు అభిలాష్ టైట్‌గా వుందంటూ మారాం చెయ్యగానే మీరేమో అపర దానకర్ణుడిలా మంచి పేరు తెచ్చుకోవాలని ఆ ఛాయమ్మ ముందు ఆ చొక్కా బిగుతుగా వుంటే ఆ ఛాయమ్మ కొడుక్కి ఇచ్చేయ్' అని నాతో ఎందుకు అన్నారు" అన్నాను.

"రెండు సంవత్సరాలు వాడాము. ఇప్పుడా చొక్కా అభిలాష్‌కు చాలా బిగుతుగా ఉంది. అందుకే అలా చెప్పాను. నేను కొత్త చొక్కాను ఆ ఛాయమ్మ కొడుక్కి ఇమ్మన్నట్లు కోప్పడుతున్నావే?" అనడిగారు.

"అది ఫారిన్ చొక్కా. రెండు సంవత్సరాలుగా వాడుతున్నా ఇప్పటికీ కొత్త చొక్కాలాగుంది. ఆఖరిసారిగా ఈ రోజు వేసి రేపు స్టీలు గిన్నెలవాడికి వేసి ఓ స్టీలు గిన్నె తీసుకుందామనుకున్నాను."

"మనింట్లో ఇప్పటికే ఎన్నో స్టీలు సామానులున్నాయి. ఆ పాత చొక్కాతో లభించే స్టీలు గిన్నెతో మనం ధనవంతులయిపోతా మనుకుంటున్నావా యమునా" అన్నారు.

"ఇప్పుడు మనింట్లో వున్న స్టీలు పాత్రలలో చాలావరకు పాతగుడ్డలు వేసి తీసుకొన్నవే" అన్నాను.

"తెలుసు కానీ, ఛాయమ్మ పని చేస్తున్నప్పుడు గమనించావా యమునా. పనిమనిషిలా కాకుండా బాధ్యతతో స్వంత ఇంటి పనిలా ఎంతో ఓపికతో మరొకరు ప్రశ్నించడానికి అవకాశం లేకుండా మెచ్చుకొనేలా పనిచేస్తుంది. ఆమె చేస్తున్న పనికి ఆ విధంగా చిన్న సహాయం చేయడం తప్పేమీ కాదు" అన్నారు.

"చూడండీ, నేను శ్రమ దోపిడి చేసేదాన్ని కాదు. ఛాయమ్మ రెండు నెలల క్రితం ఇరవై రూపాయలు నెల జీతంలో పెంచమంటే ఏవిధమైన అడ్డు చెప్పకుండా సరేనన్నాను. ఇప్పటికీ వారంలో రెండు మూడు రోజులు అన్నం, కూరలు ఇచ్చి పంపుతున్నాను" అన్నాను.

"యమునా నీవు అనారోగ్యంతో పడుకున్నప్పుడు ఛాయమ్మ ఎంతగా పనిచేసిందో నీకు తెలుసు. అంత పని చేసి కూడా తీసుకొనే నెల జీతం తప్ప నోరు తెరచి ఏమీ అడగలేదు. పాపం ఛాయమ్మ కొడుక్కి వున్నవన్నీ చిరుగు చొక్కాలే" అన్నారు మా వారు.

"అంత విశాలహృదయం నాకు లేదు. ఆ చొక్కాతో వచ్చే స్టీలు గిన్నెను అనవసరంగా వదులుకోలేను" అన్నాను.

"యమునా, నీలో స్వార్థం పెరిగిపోతున్నది. ప్చ్!" అన్నారు.

ఆయన మాటలతో సహనం నశించింది. "చూడండీ, మీరు నాలో స్వార్థం ఎక్కువ అంటున్నారు. నేను మధ్యతరగతి కుటుంబానికి చెందిన స్త్రీని. మాలాంటివారెవ్వరూ మీరిచ్చే సలహాలను పాటించరు. మా తమ్ముడుకు కొడుకు వున్నాడు. వాడికి ఇచ్చినా వాడు వాడుకుంటాడు. వాడికివ్వడానికే నా మనసు అంగీక

రించలేదు. అ ఛాయమ్మ కొడుకుకు నేను ఎలా ఇస్తాననుకున్నారు" కాస్త కోపంగా అన్నాను.

"నేను ఛాయమ్మ ముందు ఆ చొక్కాను ఛాయమ్మకు ఇవ్వమని చెప్పానుగా. పోనీ ఈ చొక్కా మాత్రం ఇవ్వకూడదూ?" అన్నారు.

"మీరా మాటలు అనగానే అలాగేనండీ ఇంకొక రెండు నెలలు వాడిన తరువాత ఇచ్చేద్దాం' అని ఛాయమ్మ ముందే మీకు సమాధానం చెప్పానుగా ఆ చొక్కాతో స్టీలు గిన్నె తీసుకున్న తరువాత ఛాయమ్మకు నేను ఎలాగోలా సర్దిచెపుతాను. ఇకమీదట అలా తొందరపడి చెప్పవద్దండి" అన్నాను.

"ఇప్పటికే అటక నిండా స్టీలు సామాన్లు వున్నాయి. ఈ జన్మలో వాటిని వాడము. అయినా నీకు ఆ గిన్నెల మీద వ్యామోహం తగ్గలేదు" నా వైపు చూడకుండా గొణుక్కుంటున్నట్లు అంటూ ప్రక్క గదిలోకి వెళ్ళారు.

← ← ←

ఆ చొక్కా వేసి బేరం చేసి స్టీలు గిన్నె తీసుకున్నాను. తళతళమని మెరిసిపోతున్న ఆ స్టీలు గిన్నెను తీసుకుంటున్నప్పుడు ఏనుగెక్కినంత సంబరం కలిగింది.

'మా వారి మాటలు విని ఈ చొక్కా మా పనిమనిషికి ఇచ్చివుంటే ఈ స్టీలు గిన్నె వచ్చేది కాదు' అనుకున్నాను.

ఆ రాత్రి మా వారికి ఆ స్టీలు గిన్నె చూపించాను. వారు స్టీలు గిన్నెపై అనాసక్తిగా ఓ చూపు విసిరి మరలా ప్రియదత్త చదవడంలో మునిగారు.

మూడు రోజుల తరువాత ఛాయమ్మతో "ఛాయమ్మా నిన్న ఉతికి ఆరవేసిన గుడ్డలలో అభిలాష్ బైట్‌గా ఉందంటున్న ఆ బొమ్మల చొక్కా ఎవరో ఎత్తుకుపోయారు" బాధపడుతున్నట్లు నటిస్తూ అన్నాను.

ఛాయమ్మ ముఖ కవళికలో వస్తున్న మార్పును చూడగానే నా మనసులో తప్పు చేశామన్న భావన కలగసాగింది.

"మీరు దొడ్డ మనసుతో ఆ చొక్కా మా అబ్బాయికివ్వాలనుకున్నారు. మా తల రాతలు బాగాలేవమ్మా. లేకుంటే అన్ని గుడ్డలు ఆరవేసితే ఆ చొక్కాను మాత్రం ఎవడో గద్దలాగా తన్నుకొని వెళతాడా" బాధగా అంది.

## అంత రేటా!



జూనియర్ ఎన్.టి.ఆర్ నటిస్తున్న 'అల్లుడు' సినిమాలో నటించడానికి రమ్యకృష్ణ 80 లక్షలు తీసుకుందని టాలీవుడ్ బోగట్టా! హీరోయిన్‌గా కొనసాగుతూనే అత్త పాత్ర చేయడానికి ఒప్పుకోవడంతో, అదే భాగ్యమంటూ నిర్మాతలు ఆమె అడిగినంత ఇవ్వడానికి సిద్ధపడ్డారట! అత్త పాత్రకి అంత రేటా! అంటూ ఈ మాట విన్న సీనియర్ సినీ నిర్మాతలు నోరెళ్లబెడుతున్నారు. అవును మరి! దీపముండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్న నానుడి ఎలాగూ ఉందిగా!

ఎలాగైతేనేం ఆ పాత చొక్కా గొడవ ఇంతటితో ముగిసిందని మనసులోనే ఓ నిట్టూర్పు విడిచాను.

ఆ రాత్రి మా వారికి ఛాయమ్మకు చెప్పిన సంగతి చెబితే అయిష్టంగా విన్నారు.

← ← ←

మరుసటి రోజు మావారు మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు ఆయనలో ఏదో మార్పు వున్నట్లు గమనించాను. భోజనం పూర్తి కాగానే ఆఫీసుకు వెళ్ళడానికి బదులు నేరుగా మంచంపై పడుకున్నారు.

"ఆఫీసుకు సెలవు పెట్టారా?" అడిగాను.

"ఇకమీదట అందరిలా నేనూ ఆలశ్యంగానే వెళతాను" కరువుగా అన్నారు.

"ఏమండీ, ఆఫీసులో ఏమయినా గొడవ జరిగిందా?"

"సిన్సియర్‌గా పనిచేసే నాకు ప్రమోషన్ ఇవ్వకుండా ఏ పనీ చేయని నా జూనియర్‌కు ఇచ్చారు. మా ఆఫీసర్‌తో గొడవ పడ్డాను. అతనికి రాజకీయ బలం వున్నట్లుంది. ఈ ప్రమోషన్ నాకు తెలియకుండా జరిగింది' అంటూ బాధపడుతున్నట్లు నటించారు. 'ఇకమీదట నేనూ అందరిలాగా పనిచేస్తాను' అని గట్టిగా అరుస్తూ చెప్పి వచ్చాను. ఇంతకాలం బాధ్యతగా మొత్తం నా తలమీద వేసుకొని పని చేశాను. ప్రమోషన్ రాకపోయినా నేను పట్టించుకునేవాడ్ని కాను. కానీ నాకన్నా జూనియర్, అస్సలు పని చేయనివాడికి ఇచ్చారు వెధవలు" అన్నారు.

నాలో అలజడి ప్రారంభమైంది. ఛాయమ్మ విషయంలో నేను, మా వారి విషయంలో వారి ఆఫీసరు క్షమించరాని తప్పు చేశాము. వారి అఫీసరును తిట్టడానికి నా నోరు పెగలలేదు. ఆ ఆఫీసరును తిడితే నన్ను నేను తిట్టుకున్నట్టుగా అనిపించసాగింది. సిగ్గుతో భారంగా అడుగులు వేసుకుంటూ వంటగదివైపు వెళ్ళాను.

← ← ←

వారం రోజులు గడిచింది. మధ్యాహ్నం భోజనం చేసి మా వారు టి.వి. చూడసాగారు.

ఆ సమయంలో ఛాయమ్మ ఇంటి లోపలికి వచ్చింది. "అమ్మగారూ అభిలాష్ చొక్కా సంతలో దొరికింది. అన్నిండ్లల్లో పని పూర్తి చేసుకొని సంతకెళితే పాత గుడ్డలమ్మే చోట మన బాబు చొక్కా చూసి 'ఇది దొంగిలించిన చొక్కా' అంటూ వాడితో గొడవపడ్డాను. చివరకు గుంపు ఎక్కువ కాగానే 'అమ్మా ఇది దొంగసరుకు కాదన్నా నీవు నమ్మడం లేదు. నా పిల్లల మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. దీన్ని ముప్పయ్ రూపాయలకు కొన్నాను' అని చెప్పగా 'ముప్పయ్ రూపాయలు ఇచ్చి తీసుకొని వచ్చాను" అంటూ అభిలాష్ చొక్కా నా చేతికిచ్చింది.

నేను ఆ చొక్కాను అమ్మి వుండనన్న నమ్మకం పెట్టుకున్న ఛాయమ్మ వైపు సూటిగా చూడటానికి మనసులో అవమానంగా తోచింది.

నేను వెళ్ళి యాభై రూపాయలు తీసుకొని వచ్చి చొక్కాతో కలిసి ఆ యాభై రూపాయలు ఇస్తూ "ఛాయమ్మా, అంగడివాడికి ఇచ్చిన ముప్పయ్ రూపాయలు తీసుకో. మిగిలిన డబ్బుతో మీ అబ్బాయికి ఏదైనా కొనివ్వు. ఆ చొక్కా ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చావు? ఎలాగూ నేను ఇవ్వాలనుకొన్నదే కదా!" ఆశ్చర్యం, సంతోషం కలిగిన ముఖంతో నావైపు చూడసాగారు మా శ్రీవారు. ←